## 5వ అధ్యాయం

## నమాజ్‌లో అశక్తత, అణకువ

## ٥ - بَابُ الْحَثِّ عَلَى الْخُشُوعِ فِي الصَّلاَةِ

187. హ|జత్ అబూ హురైరా (రజి) కథనం: నమాజ్‌లో తమ (రెండు) చేతులను రెండు జబ్బలపై పెట్టుకుని నమాజ్ చేయటాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించారు. (బుఖారీ, ముస్లిం - హదీసు వాక్యం మాత్రం ముస్లింలోనిది)

(١٨٧) عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: نَهَى رَسُولُ اللهِ ﷺ أَنْ يُصلِّيَ الرَّجُلُ مُخْتَصِراً. مُتَّفَقٌ عَلَيْهِ، وَاللَّفْظُ لِمُسْلِمٍ، وَمَعْنَاهُ أَنْ يَجْعَلَ يَدَهُ عَلَى خَاصِرَتِهِ.

బుఖారీలోని హ|జత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖనంలో ఇలా వుంది - "ఇది యూదుల ఆరాధనా పద్ధతి."

وَفِي الْبُخَارِيِّ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا: «أَنَّ ذَلِكَ فِعْلُ الْيَهُودِ».

### సారాంశం

నమాజ్ కేవలం అల్లాహ్ కొరకే చేస్తున్నపుడు పూర్తి ఏకాగ్రతతో, మనసును లగ్నం చేసి మరీ చేయాలి. నమాజ్ స్ఫూర్తికీ, దాని స్వభావానికి, సంస్కారానికి విరుద్ధమయిన ఏ పనీ అందులో జరగరాదు. నమాజ్‌లో చేతులు కట్టుకుని నిలబడటమే మర్యాద అనిపించుకుంటుంది. జబ్బలపై చేతులు పెట్టుకుని నిలబడటం అణకువకి కాదుకదా అది అహంకారానికి ప్రతిరూపం. నమాజులోనయితే దాసుని అశక్తత, అణకువ, వినయ వినమ్రతలు తొణకిసలాడాలి. అందుకే చేతుల్ని జబ్బలపై (లేదా ప్రక్కలపై) పెట్టుకోవడాన్ని వారించటం జరిగింది. అదీగాక ఈ పద్ధతి యూదుల ఆరాధనా పద్ధతిని పోలివుండటంచేత దానిని విడనాడవలసిన అవసరం కూడా ఏర్పడింది.

188. హ|జత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "సాయంకాలపు భోజనం గనక తయారై ఉంటే మ|గిబ్ నమాజ్ చేయకముందే భుజించండి." (బుఖారీ, ముస్లిం)

(١٨٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «**إِذَا قُدِّمَ الْعَشَاءُ فَابْدَءُوا بِهِ قَبْلَ أَنْ تُصَلُّوا الْمَغْرِبَ**». مُتَّفَقٌ عَلَيْهِ.

### సారాంశం

దీని భావం ఏమిటంటే నమాజ్‌కు ముందే వంట పూర్తయి భోజనం వడ్డించబడితే - ఆకలి కూడా ఉంటే - నమాజ్‌కు ముందే తినటం మంచిది. దీనివల్ల నమాజ్‌లో ఏకాగ్రత ఉంటుంది. మనిషి ఆకలి బాధతో అలమటిస్తున్నపుడు అతని మనసు నమాజ్‌లో లగ్నమవదు. అతని ధ్యాసంతా అన్నపానీయాలపైనే ఉంటుంది.;;;

(١٨٩) وَعَنْ أَبِي ذَرٍّ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: **«إِذَا قَامَ أَحَدُكُمْ فِي الصَّلَاةِ فَلَا يَمْسَحِ الْحَصَى، فَإِنَّ الرَّحْمَةَ تُوَاجِهُهُ»**. رَوَاهُ الْخَمْسَةُ بِإِسْنَادٍ صَحِيحٍ، وَزَادَ أَحْمَدُ: **«وَاحِدَةً أَوْ دَعْ»**. وَفِي الصَّحِيحِ عَنْ مُعَيْقِيبٍ نَحْوُهُ بِغَيْرِ تَعْلِيلٍ.

189. హజ్రత్ అబూజర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు: "మీలో ఏ వ్యక్తయినా నమాజ్ చేస్తున్నప్పుడు (సజ్దా చేసే స్థలం నుండి) కంకరరాళ్ళను తన చేత్తో తొలగించరాదు. ఎందుకంటే (ఆ సమయంలో) దైవకారుణ్యం నమాజీ వైపునకు కేంద్రీకృతం అయి ఉంటుంది." (దీనిని అహ్మద్, అబూ దావూద్, తిర్మిజీ, నసాయి, ఇబ్నె మాజ లైదుగురూ ప్రామాణిక ఆధారాలతో ఉల్లేఖించారు)

ముస్నద్ అహ్మద్‌లో అదనంగా ఇలా ఉంది - "ఒకవేళ కంకరరాళ్లను తొలగించాలనే అనుకుంటే ఒకసారి తొలగించండి లేదా వదిలెయ్యండి" సహీహ్ బుఖారీలో హజ్రత్ ముఐఖిబ్‌చే ఈ విధంగా ఉల్లేఖించబడింది. అందులో కారణం తెలుపబడలేదు.

## సారాంశం

నమాజ్ మధ్యలో సజ్దా చేసే స్థలాన్ని శుభ్రపరచటం, తుడవటం సమంజసం కాదని ఈ హదీసు ద్వారా రూఢీ అవుతున్నది. ఒకవేళ అలాంటిదేదయినా చేయాల్సివుంటే నమాజ్‌కు ముందే చేసుకోవాలి. ఇలా వారించబడటంలోని ఆంతర్యం ఏమిటంటే నమాజ్‌లో మనిషికి ఒక్క నమాజ్ తప్ప మరో ధ్యాస ఉండకూడదు. అతని మనసు నమాజ్‌లో పూర్తిగా నిమగ్నమై ఉండాలి. నమాజ్ మధ్యలో అతని నుదుటికి దుమ్ము తగిలినా, లేక మరేదయినా గడ్డి పరకలాంటిది అంటుకున్నా మధ్యలోనే దాన్ని దులపకూడదు. ఎందుకంటే ఆ సమయంలో దైవకారుణ్యం అతని వైపునకు మరలి ఉంటుంది. కీలకమయిన ఆ ఘడియలో అతను తన ఏకాగ్రతను పోగొట్టే చేష్టలకు పాల్పడితే దైవకారుణ్యానికి దూరమయ్యే ప్రమాదముంది. కనుక మరీ అనివార్యమైతే తప్ప అతను ఇలాంటి చేష్టలకు పాల్పడ కూడదు.

## హదీసు ఉల్లేఖకులు

ముఐఖిబ్ (రజి) పూర్తిపేరు ముఐఖిబ్ బిన్ అబూ ఫాతిమ. దౌస్ తెగకు చెందిన వారవటంచేత 'దౌసీ'గా పిలువబడేవారు. మక్కాలోనే ఇస్లాం స్వీకరించారు. దైవమార్గంలో అబిసీనియా వైపునకు హిజ్రత్ చేశారు. బద్ర్ సంగ్రామంలో పాల్గొన్నారు. దైవప్రవక్త (స) వారి 'ప్రవక్తా ముద్ర' ను భద్రపరచేవారు. హజ్రత్ అబూబక్ర్, హజ్రత్ ఉమర్‌లు ఈయన్ని కోశాగారానికి ఇన్‌చార్జిగా నియమించారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖిలాఫత్ కాలంలో ఈయన మరణించారు.

(١٩٠) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنِ الالتِفَاتِ فِي الصَّلاَةِ، فَقَالَ: «هُوَ اخْتِلاَسٌ يَخْتَلِسُهُ الشَّيْطَانُ مِنْ صَلاَةِ العَبْدِ». رَوَاهُ الْبُخَارِيُّ.

190. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: నేను దైవప్రవక్త (సఅసం)ను నమాజులో కళ్ల కొనలతో అటూఇటూ దృష్టిసారించడాన్ని గురించి అడిగాను. దీనికాయన (సఅసం), "ఇది షైతాన్ దోబూచులాట. దీనిద్వారా షైతాన్ దాసుని నమాజ్‌ను దోచుకుంటాడు" అని చెప్పారు. (బుఖారీ)

وَلِلتِّرْمِذِيِّ عَنْ أَنَسٍ – وَصَحَّحَهُ –: «إِيَّاكَ وَٱلالْتِفَاتَ فِي الصَّلاَةِ، فَإِنَّهُ هَلَكَةٌ، فَإِنْ كَانَ لاَ بُدَّ فَفِي التَّطَوُّعِ».

తిర్మిజీలోని హదీసులో దైవప్రవక్త (స) ఇలా చెప్పారని ఉంది: "నమాజ్‌లో దోబూచులాటకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించండి. ఇది వినాశకర చేష్ట. మరీ అంతగా అవసరమైతే నఫిల్ నమాజులలో అలా చేయవచ్చు."

## సారాంశం

షైతాన్ మనిషికి బద్ధశత్రువు. మనిషికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ వాడు జారవిడుచుకోడు. ఆఖరికి నమాజులో సయితం మనిషిని వెంటాడి, అతని ఆలోచనలను పరిపరి విధాలా మళ్లించి అతన్ని మరుపుకు లోను చేయాలని చూస్తాడు. కనీసం నమాజీ దృష్టినయినా మరో వైపు మళ్లించాలని ఎత్తు వేస్తాడు. ఆ విధంగానయినా మనిషిని పరధ్యానానికి లోనుచేయవచ్చన్నది వాడి ఉద్దేశ్యం. అందుకే దైవప్రవక్త (సఅసం) నమాజ్ చేసే వ్యక్తిని; షైతాన్ ఎత్తుగడలనుంచి కడు జాగ్రత్తగా, సావధానంగా ఉండాలని తాకీదు చేశారు. మరీ అనివార్యమైతేనే దృష్టిని ప్రక్కకు మరల్చాలి. అది కూడా ముఖం త్రిప్పేబదులు కళ్ల కొనలతో చూడాలంతే. అంతేగాని ఈ చేష్టను అలవాటుగా చేసుకోరాదు.

(١٩١) وَعَنْ أَنَسٍ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ

191. హజ్రత్ అనస్ (రజి) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا كَانَ أَحَدُكُمْ فِي الصَّلاَةِ فَإِنَّهُ يُنَاجِي رَبَّهُ فَلاَ يَبْصُقَنَّ بَيْنَ يَدَيْهِ وَلاَ عَنْ يَمِينِهِ، وَلَكِنْ عَنْ شِمَالِهِ تَحْتَ قَدَمِهِ». مُتَّفَقٌ عَلَيْهِ، وَفِي رِوَايَةٍ: «أَوْ تَحْتَ قَدَمِهِ».

ప్రవచించారు - "మీలో ఎవరయినాసరే నమాజ్ చేస్తున్నప్పుడు అతడు తన ప్రభువుతో సంభాషిస్తూ ఉంటాడు. (కాబట్టి ఈ స్థితిలో) తన ముందు వైపు గానీ, కుడిప్రక్కనగానీ ఉమ్మివేయ రాదు. దానికి బదులు తన ఎడమ వైపున కాలి క్రింద (ఉమ్మాలి)" (బుఖారీ, ముస్లిం). "ఎడమవైపున లేక తన కాలి క్రింద" అని వేరొక ఉల్లేఖనంలో ఉంది.

**సారాంశం**

నమాజ్ చేస్తుండగా ఉమ్మి వచ్చినా, జలుబు కారణంగా ముక్కులోనుంచి నీరు వచ్చినా ఖిబ్లా దిశలోగానీ, కుడి వైపునగానీ ఉమ్మటంగానీ, ముక్కు చీదటం గానీ చేయరాదని ఈ హదీసు ద్వారా తేటతెల్లమవుతోంది. ఆ సమయంలో మనిషి మస్జిద్‌లోవుంటే చేతి తువాలును గానీ, గుడ్డ (లేక టిష్యూ పేపర్)నుగానీ అడ్డుపెట్టుకోవాలి. ఒకవేళ ఆ క్షణంలో ఏ వస్తువూ లేకపోతే - గత్యంతరంలేని స్థితిలో - తన ఎడమకాలిక్రింద పారవేయాలి. మస్జిద్‌లో తివాచీ తదితర పాన్పులు లేనపుడే ఇది సాధ్యమవుతుంది. నమాజ్ ముగించిన వెంటనే ఆ స్థలాన్ని నీళ్లతో కడిగివేయాలి. వీలయితే డెట్టాల్ లాంటి క్రిమి సంహారక ద్రవ్యంగానీ, సుగంధద్రవ్యంగానీ అక్కడ చిలకరించి అశుద్ధతా ప్రభావాన్ని పూర్తిగా రూపుమాపాలి. ఇది ఒక విధంగా చేసిన తప్పుకు పరిహారం లాంటిదన్నమాట.

మొత్తానికి నమాజ్‌లో ఖిబ్లా దిక్కున ఉమ్మి వేయటం తప్పు. కొంతమంది ప్రవక్త ప్రియసహచరులు, వారి శిష్యులు నమాజ్‌లో లేనపుడు (సాధారణ సమయాలలో) కూడా ఈ నియమాన్ని పాటించేవారు. ఖిబ్లా దిశపట్ల వారికున్న గౌరవమర్యాదలకు ఇదొక మచ్చు తునక. దైవప్రవక్త (స) ఒక ఇమామ్‌ను, నమాజ్ చేస్తుండగా ఖిబ్లా దిక్కున ఉమ్మివేసినందుకు, ఇమామత్ బాధ్యతలనుండి ఉద్వాసన పలికారని అబూదావూద్‌లో ఉల్లేఖించబడింది.

(١٩٢) وَعَنْهُ قَالَ: كَانَ قِرَامٌ لِعَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا، سَتَرَتْ بِهِ جَانِبَ بَيْتِهَا، فَقَالَ لَهَا النَّبِيُّ ﷺ: «أَمِيطِي عَنَّا قِرَامَكِ هَذَا، فَإِنَّهُ لاَ تَزَالُ تَصَاوِيرُهُ تَعْرِضُ لِي فِي صَلاَتِي». رَوَاهُ الْبُخَارِيُّ.

192. హ్రజత్ అనస్ (రజి) కథనం: హ్రజత్ ఆయిషా (ర.అన్హా) గారి వద్ద ఒక ఆకర్షణీయమైన తెర (పరదా నిమిత్తం) ఉండేది. దాన్ని ఆమె తన కుటీరంలో ఒకచోట వ్రేలాడదీశారు. దైవప్రవక్త (సఅసం) దాన్ని గమనించి, "ఆకర్షణీయమైన ఈ తెరను మా ముందునుంచి తీసివెయ్యి. ఎందుకంటే

وَاتَّفَقَا عَلَى حَدِيثِهَا فِي قِصَّةِ أَنْبِجَانِيَّةِ أَبِي جَهْمٍ، وَفِيهِ: «فَإِنَّهَا أَلْهَتْنِي عَنْ صَلَاتِي».

దీనిపై వున్న చిత్రాలు నమాజులో నా ముందుకు వచ్చి ఆటంకం కలిగిస్తున్నాయి" అని సెలవిచ్చారు. (బుఖారీ) బుఖారీ మరియు ముస్లిం లిరువురూ అబూజహమ్ గారి ఉన్ని తెర వృత్తాంతంపై ఏకాభిప్రాయం కలిగివున్నారు. అందులో ఇలా వుంది: "ఈ తెర నన్ను నా నమాజ్ నుండి విస్మరణకు గురి చేసింది."

## సారాంశం

ఈ హదీసు ద్వారా మనకు లభించే గుణపాఠం ఏమిటంటే; నమాజీ ఏకాగ్రతను భగ్నం చేసి అతని దృష్టిని తనవైపునకు త్రిప్పుకునే ప్రతి వస్తువునూ దూరంగా ఉంచాలి. దాన్ని నమాజ్ చేసేచోటినుంచి తొలగించటం సంభవం కాకపోతే స్వయంగా అక్కడినుండి నిష్క్రమించి వేరేచోట నమాజ్ చేయాలి. నమాజ్‌లో ఏకాగ్రతను, వినమ్రతను, భక్తి పారవశ్యాన్ని కాపాడుకోవటానికి ఈ చర్య తీసుకోవటం అవసరం.

## హదీసు ఉల్లేఖకులు

అబూజహమ్ (రజి) - ఈయన ఇబ్నె హుజైఫా బిన్ ఘానిమ్ ఖురషీ అదవీ. అదవీ తెగకు చెందిన వారవటం చేత అదవీగా వ్యవహరించబడేవారు. ఈయన అసలు పేరు ఆమిర్ లేక ఉబైద్. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. సుదీర్ఘ ఆయుష్షు పొందిన వారిలో ఒకరు. ఖురైషులు కాబాను నిర్మించినపుడూ ఉన్నారు. ఇబ్నె జుబైర్ (రజి) కాబా గృహాన్ని నిర్మించిననాటికి కూడా ఈయన జీవించివున్నారు. ఈయన ఇబ్నె జుబైర్ (రజి) ఖిలాఫత్ తొలికాలంలో మరణించారు.

(١٩٣) وَعَنْ جَابِرِ بْنِ سَمُرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَيَنْتَهِيَنَّ أَقْوَامٌ يَرْفَعُونَ أَبْصَارَهُمْ إِلَى السَّمَاءِ فِي الصَّلَاةِ، أَوْلَا تَرْجِعُ إِلَيْهِمْ». رَوَاهُ مُسْلِمٌ.

193. హజ్రత్ జాబిర్ బిన్ సమురః (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ముస్లిం జాతి నమాజు చేస్తున్నప్పుడు తమ చూపులను ఆకాశం వైపునకు మరల్చే చేష్టకు దూరంగా ఉండాలి. లేకుంటే వారి చూపు తిరిగి రాని పరిస్థితి ఏర్పడవచ్చు (అంటే అంధులుగా మారిపోవచ్చు). (ముస్లిం)

وَلَهُ عَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «لاَ صَلاَةَ بِحَضْرَةِ الطَّعَامِ، وَلاَ وَهُوَ يُدَافِعُهُ الأَخْبَثَانِ».

'ముస్లిం'లోనే హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి ఉల్లేఖనం ఇలా వుంది: "భోజనం తయారై వుండగా, (మల మూత్ర విసర్జన) అవసరం ఏర్పడి వుండగా చేసే నమాజ్ నెరవేరదు" అని దైవప్రవక్త (సఅసం) చెప్పగా నేను విన్నాను.

**సారాంశం**

నమాజ్ మధ్యలో ఆకాశం వైపు చూడటం హరామ్ (నిషిద్ధం). ఇలా చూచేవాని నమాజ్ స్వీకరించబడదని ఇబ్నె హజమ్ (రహ్మ.లై) అభిప్రాయపడ్డారు. ఇమామ్ నవవీ (రహ్మ.లై) ముస్లిం వ్యాఖ్యానంలో - ఆకాశం వైపునకు చూచేవానికి ఇందులో తీవ్రమయిన హెచ్చరిక ఉందని అన్నారు. ఈ విషయంపై ఆయన పండితుల, విద్వాంసుల ఏకాభిప్రాయాన్ని కూడా నకలు చేశారు.

నమాజ్ ప్రారంభించకముందే కాలకృత్యాలు తీర్చుకోవటం మంచిది. మలమూత్రాలను విసర్జించవలసిన అవసరం ఏర్పడి ఉండగా, వాటిని బలవంతంగా ఆపే ప్రయత్నం చేస్తూ నమాజ్కై ఉపక్రమించటం మంచిదికాదు. దీనివల్ల నమాజ్లో ఏకాగ్రత దెబ్బతింటుంది. నమాజ్ నుంచి ఎప్పుడు బయటపడాలా? అన్న ఆలోచన అతన్ని తొలచివేస్తూ ఉంటుంది.

(١٩٤) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ. أَنَّ النَّبِيَّ ﷺ: قَالَ: «التَّثَاؤُبُ مِنَ الشَّيْطَانِ فَإِذَا تَثَاءَبَ أَحَدُكُمْ فَلْيَكْظِمْ مَا اسْتَطَاعَ». رَوَاهُ مُسْلِمٌ وَالتِّرْمِذِيُّ، وَزَادَ: «فِي الصَّلاَةِ».

194. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూ హురైరా (రజి) వక్కాణించారు: "ఆవులింత రావటం షైతాన్ చేష్ట. మీలో ఎవరికయినా ఆవులింత వస్తే వీలయినంతవరకు దాన్ని ఆపడానికి ప్రయత్నించండి." (ముస్లిం, తిర్మిజీ - తిర్మిజీ తన ఉల్లేఖనంలో "నమాజులో" అన్న పదం పెంచారు).

**సారాంశం**

ఆవులింత సోమరితనానికి, బద్ధకానికి, నిద్రమత్తుకు, మితిమీరిన తిండికి ప్రబల నిదర్శనం. దైవదాసుణ్ణి అలాంటి స్థితిలో చూచి షైతాన్ మహా సంబరపడిపోతాడు.